తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

ద్రవిడ వర్సిటీకి విచ్చేసిన నాక్ బృందం

పలు విభాగాలు పరిశీలన.. విద్యార్థులు,ఉద్యోగులతో సమావేశం !!

కుప్పం, జనవరి 22 ప్రభాతవార్త
నేషనల్ అక్రిడిటేషన్ కమిటీ (నాక్) బృందం బుధవారం ద్రవిడ విశ్వవిద్యాలయంకు విచ్చేసింది. ప్రొఫెసర్ ప్రేమండో మాథూర్ నేతృత్వంలో డా॥ రీతు లెహల్, డా॥ విమల్ కిషోర్,డా॥ కనిక శర్మ, డా॥ అరుణ్ ఎస్ కారత్‌తో పాటు మరో ఇద్దరు సభ్యులతో కూడిన బృందం మూడు రోజుల పాటు వర్సిటీలో పర్యటించనుంది. వర్సిటీ క్యాంపస్‌కు వచ్చిన నాక్ బృందానికి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్‌లు ఘనస్వాగతం పలికారు. అనంతరం నాక్ బృందం వర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీతో పాటు అన్ని విభాగాలను పరిశీలించింది. వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగస్తులతో వేర్వేరుగా సమావేశమై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వర్సిటీలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను వారు వీక్షించారు. కార్యక్రమంలో పలువురు విభాగాధిపతులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అమ్మణ్ణికి వెండి వస్తువులు బహూకరణ

సూళ్లూరుపేట, జనవరి 22 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలో వెలసి ఉన్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి వెండి వెండి వస్తువులను స్థానికులు ఇమ్మానేని సత్యనారాయణ, బాబామణి, ఇమ్మానేని చంద్రశేఖర్‌రావు, చంద్రమతి దంపతులు ఆలయ సహాయక కమిషనర్ ప్రసన్నలక్ష్మికి బుధవారం అందజేశారు. అమ్మణ్ణికి నైవేద్యం సమయంలో ప్రసాదాలు ఉపయోగించేందుకు సుమారు రూ.7.50 లక్షల విలువ చేసే 6 కిలోల 400 గ్రాములు బరువు కలిగిన రెండు ప్రసాదం గంగాళాలతో పాటు ఒక వెండి దివిటీని కూడా ఇమ్మానేని కుటుంబం అందజేసింది. ఈ కార్యక్రమంలో ఇమ్మానేని శ్రీనివాసరావు దంపతులు కూడా పాల్గొన్నారు.

తొక్కిసలాట ఘటనపై

ఇక న్యాయవిచారణ !

-ఆ రోజు ఏం జరిగింది!? ఎలా ప్రాణాలు కోల్పోయారు!!

-విశ్రాంత న్యాయమూర్తి జస్టీస్ సత్యనారాయణమూర్తి నియామకం

(ఫైల్)

ప్రభాతవార్త-తిరుపతి:
దేవుని దర్శనం కోసం వస్తే దర్శన టోకెన్లు అందుకునేందుకు భారీగా తరలివచ్చిన సామాన్యభక్తులకు సరైన సదుపాయాలు, భద్రత కల్పించలేకుండా ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ప్రభుత్వం న్యాయవిచారణకు ఆదేశించింది. ఇందుకోసం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టీస్ సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో విచారణ సాగనుంది. విశ్రాంత జడ్జికి సహకారంగా న్యాయవిభాగం ,పోలీసుశాఖల నుండి కొంతమంది సిబ్బంది ఉండనున్నారు. ఇప్పటికే ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు మృతులు విశాఖపట్నం తాటిచెట్లపాలెంకు చెందిన లావణ్యస్వాతి(37), కంచర్లపాలెంకు చెందిన శాంతి(35), మద్దెలపాలెంకు చెందిన రజని(47), నరసరావుపేట రామచంద్రాపురంకు చెందిన బాబునాయుడు(51), తమిళనాడు సేలంజిల్లా మేదారిగ్రామంకు చెందిన మల్లిగ(50), పొల్లాచ్చికి చెందిన నిర్మల(45) కుటుంబసభ్యులకు ఒక్కొక్కరికి టిటిడి 25లక్షల రూపాయలు పరిహారం కూడా అందజేసింది. ఆ కుటుంబాల్లో ఒక్కొక్కరికి టిటిడిలో కాంట్రాక్టు ఉద్యోగం కల్పిస్తారు. తీవ్రంగా క్షతగాత్రులైన 31మందికి 5లక్షలు రూపాయలు, క్షతగాత్రులైన 20మందికి 2లక్షల రూపాయలు పరిహారం చెల్లించిన విషయం విదితమే. అయితే పటష్టంగా, పక్కాగా ఏర్పాట్లుచేపట్టడంలో,భక్తులను నియంత్రించడంలో టిటిడి, తిరుపతి జిల్లా పోలీసులకు ఎంతో అనుభవం ఉంది. కానీ ఈనెల 8వతేదీ తిరుపతిలో టోకెన్లు జారీఅయిన కేంద్రాల్లో మూడు ప్రాంతాల్లో శ్రీనివాసం, విష్ణునివాసం, బైరాగిపట్టెడ కేంద్రాల్లోనే ఈ ఘటనలు జరగడం వెనుక కారణాలు న్యాయవిచారణలో వెలుగుచూడనున్నాయి. ఈ దారుణంపై ఏకంగా టిటిడి జెఈఓ గౌతమి, సివిఎస్ఓ శ్రీధర్, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి టౌన్ డిఎస్పీ వెంకటనారాయణ బదిలీ అయ్యారు. తిరుపతి క్రైమ్ డిఎస్పీ రమణకుమార్, టిటిడి గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి సస్పెన్షన్‌కు గురయ్యారు.

-కీలకం కానున్న న్యాయవిచారణ:

పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల టోకెన్లు అందుకునేందుకు 8వతేదీనే తిరుపతికి తెలుగురాష్ట్రాలు, తమిళనాడు,కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, ఒరిస్సా నుండి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చారు. వీరికి అవసరమైన మేరకు కొన్ని కేంద్రాల్లో కనీస సదుపాయాలు,సౌకర్యాల కల్పనలో టిటిడి,పోలీసు, జిల్లాయంత్రాంగం ఘోరవైఫల్యం చెందడమే కారణమని క్షతగాత్రులైన భక్తుల సమాచారం. అంతేగాక ఆయా చోట్ల సామర్థ్యానికి మించి భక్తులను గంటలతరబడి నిరీక్షింపజేయడం కూడా ఒక కారణంగా మారింది. ఇప్పుడు తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై విశ్రాంత న్యాయమూర్తి న్యాయవిచారణ మొదలైతే ఎవరెవరిని విచారణ చేస్తారు?ఏ కోణంలో ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబడుతారనేది అటు టిటిడి ఇటు పోలీసు,రెవెన్యూ వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది. న్యాయవిచారణలో మరికొందరు అధికారులపై చర్యలకు అవకాశం లేకపోలేదనేది పోలీసువర్గాల్లో చర్చనీయాంశం. అయితే ఆరునెలల్లో సమగ్రమైన నివేదిక ఇవ్వాల్సి ఉంది.

వీరుడా...! ఇక సెలవు....!

జవాన్ చిత్రపటంతో దుఖిస్తున్న కార్తీక్ తల్లిదండ్రులు

జనసంద్రమైన ఎగువ రాగిమానుపెంట
ప్రభుత్వ లాంఛనాలతో వీరజవాన్‌కు అంత్యక్రియలు
వీర జవాన్ కుటుంబానికి అండగా నిలుస్తాం: ఎమ్మెల్యేలు

జవాన్ అంతిమ యాత్ర ,

అంత్యక్రియల గౌరవ వందనం చేస్తున్న ఆర్మీ అధికారులు

బంగారుపాళ్యం, జనవరి 22 ప్రభాతవార్త:
దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ కార్తీక్‌కు బుధవారం సాయంత్రం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలో ఆదివారం ఉగ్రదాడుల్లో తీవ్రంగా గాయపడిన వీరజవాన్ కార్తీక్ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. కార్తీక్ మృతదేహం జమ్ము కాశ్మీర్ నుండి ప్రత్యేక విమానంలో హైదరాబాదు, అటు బెంగళూరు విమానాశ్రయంకు చేరుకుంది. అక్కడి నుండి ప్రత్యేక అంబులెన్స్‌లో బుధవారం తెల్లవారుజామున 6 గంటలకు జవాను స్వగ్రామం ఎగువ రాగిమానుపెంటకు ఆర్మీ ఉన్నత అధికారులు తీసుకువచ్చారు. బంగారుపాళ్యం నుండి 8 కిమీ మేరకు వున్న రాగిమానుపెంట గ్రామానికి యువకులు బైక్ ర్యాలీ చేపట్టి కార్తీక్ మృతదేహంపై పూలు చల్లుతూ కన్నీటి స్వాగతం పలికారు. కార్తీక్ మృతదేహంను చూసిన అతని తల్లిదండ్రులు వరదరాజులు, సెల్విలు బోరున విలపించసాగారు. వారిని ఓదార్చడం కష్టతరమైంది. వీర జవాన్ కార్తీక్ మృతదేహం స్వగ్రామం రాగిమానుపెంటకు చేరుకున్న విషయం మండల ప్రజలకు తెలియడంతో పరిసర గ్రామస్తులు, పెద్ద ఎత్తున యువత రాగిమానుపెంట గ్రామం చేరుకున్నారు. కార్తీక్ మృతదేహంపై పలువురు పుష్పగుచ్చాలు, పూలు చల్లి నివాళులు అర్పించారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, చిత్తూరు మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత పలువురు కార్తీక్ మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ రాగిమానుపెంట గ్రామంకు చేరుకుని ప్రభుత్వ పరంగా పుష్పగుచ్చం కార్తీక్ మృతదేహంపై వుంచి గౌరవ వందనం చేశారు.

రాగిమానుపెంట జనసంద్రం

వీర జవాన్ కార్తీక్ మృతదేహంను సందర్శించడానికి అత్యధిక సంఖ్యలో జనం రావడంతో ఎగువ రాగిమానుపెంట గ్రామం బుధవారం జనసంద్రంతో క్రిక్కిరిసింది. మిలటరీ ఉన్నత అధికారులు జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రదాడిలో మృతి చెందిన వీరజవాన్ కార్తీక్

నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

మృతదేహంను బుధవారం తెల్లవారుజాము అతని స్వగ్రామం ఎగువ రాగిమానుపెంట గ్రామంకు తీసుకువచ్చారు. వీర కార్తీక్ మృతదేహం గ్రామానికి చేరిందనే విషయం నిముషాల వ్యవధిలో మండలం మొత్తం వ్యాపించడంతో కార్తీక్ మృతదేహంను చివరి చూపు చూడటానికి చిత్తూరు, యాదమరి, బంగారుపాళ్యం, పలమనేరు, తవణంపల్లి, ఐరాల తదితర మండలాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు ఎగువ రాగిమానుపెంట గ్రామంకు తరలివచ్చారు. వీరందరు ఒక్కసారిగా ఎగువ రాగిమానుపెంట గ్రామంకు రావడంతో రహదారి క్రిక్కిరిసిపోయింది. బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు జన తాకిడి ఏ మాత్రం తగ్గలేదు. సాయంత్రం ఆర్మీ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనానికి వివిధ పుష్పాలతో అలంకరించి ఈ వాహనంపై కార్తీక్ మృతదేహంను వుంచి సుమారు 2 కిమీ దూరంలో వున్న జవాన్‌కు చెందిన వ్యవసాయ భూమి వద్దకు తీసుకెళ్ళారు. ఈ రోడ్డు పొడవునా జనసందోహం గుమిగూడిపోయింది. చివరికి మిలటరీ అధికారులు గౌరవ వందనంతో మూడు రౌండ్లు తుపాకీతో కాల్పులు జరిపారు. అనంతరం కార్తీక్ మృతదేహంను సంప్రదాయ రీతిలో ఖననం చేశారు.

వీరజవాన్ కుటుంబంను ఆదుకుంటాం

- ఎమ్మెల్యేలు డాక్టర్ కలికిరి మురళీమోహన్, గురజాల జగన్మోహన్‌నాయుడులు

వీర జవాన్ కార్తీక్ కుటుంబంను అన్ని విధాల ఆదుకుంటామని పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు డాక్టర్ కలికిరి మురళీమోహన్, గురజాల జగన్మోహన్‌నాయుడులు హామీ ఇచ్చారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కార్తీక్ యువతకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాడన్నారు. కార్తీక్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటు అని ప్రభుత్వపరంగా తాము ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే బిఎన్.రాజసింహులు, చిత్తూరు మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు జయప్రకాష్, జనార్ధన్‌గౌడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ జడ్పీ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపిపి అమరావతమ్మ, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ తోట శ్రీహరి, విశ్రాంత సైనికులు తదితరులు కార్తీక్ మృతదేహంకు నివాళులు అర్పించి సంతాపం తెలిపారు.

మృతుడి కుటుంబానికి భారీ భరోసా ఇస్తాం : కలెక్టర్ సుమిత్‌కుమార్

వీర జవాన్ కార్తీక్ కుటుంబానికి ప్రభుత్వ పరంగా భారీ భరోసా అందిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. జవాన్ మృతి చెందిన విషయం ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టిలో వుందని, విజయవాడలోని సిఎంఓ కార్యాలయ అధికారులను సంప్రదిస్తున్నామన్నారు. తక్షణమే జవాన్ కుటుంబానికి 5 ఎకరాల సాగు భూమి, 5 సెంట్ల నివాస స్థలం జవాన్ కార్తీక్ సోదరుడు రాజేష్‌కు ఔట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగం కల్పించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దావోస్ పర్యటన నుండి తిరిగి వచ్చిన అనంతరం భారీ మొత్తంలో వీర జవాన్ కార్తీక్ కుటుంబానికి ప్రభుత్వం అందిస్తుందన్నారు. అలాగే వీరజవాన్ కార్తీక్ విద్యనభ్యసించిన రాగిమానుపెంట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కార్తీక్ విగ్రహ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

డి.వి సత్రం పిహెచ్‌సిలో

అందుబాటులోలేని డాక్టర్లు

ఇబ్బందులు పడుతున్న రోగులు

దొరవారిసత్రం, జనవరి 22 ప్రభాతవార్త.
తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రభుత్వ డాక్టర్లు ఆరోగ్యకేంద్రంలో అందుబాటులో వుండట్లేదని పలువురు రోగులు వాపోతున్నారు. దొరవారిసత్రం మండల పరిధిలో 22 పంచాయితీల గ్రామ ప్రజలకు మండల కేంద్రంలో నేషనల్ హైవే పక్కన ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటుచేసి ప్రజలకు 24 గంటలు ఆరోగ్య సేవలు అందించడానికి ఇద్దరు డాక్టర్లును నియమించినా ప్రజలకు ఎలాంటి ప్రయేజనం జరగట్లేదని తాము ఎప్పుడు హాస్పిటల్‌కి వెళ్లినా డాక్టర్లు అందుబాటులో ఉండట్లేదని పలువురు రోగులు వాపోతున్నారు.

డాక్టర్ల అవతారమెత్తిన నర్సులు...

దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అన్నీతామే అంటు హాస్పిటల్లో రోగులకు చికిత్స చేస్తున్న నర్సులు.ఈ ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం ఇద్దరు డాక్టర్లను నియమించినప్పటికీ వారు మాత్రం నామమాత్రంగా హాస్పిటల్‌కి వచ్చి రిజిష్టర్లలో హాజరు నమోదుచేసుకుని బయట వెల్లిపోతున్నారని,ఇక్కడ ఉన్న నర్సులు వాల్లకు తెలిసిన వరకు చూసి రోగులను పంపుతున్నారని తమ ఆవేదనను రోగులు వాపోతున్నారు.ఇకనైనా ఉన్నతధికారులు ఈ హాస్పిటల్‌పై దృష్టిపెట్టి డాక్టర్లను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు వాపోతున్నారు.

ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత

- జాతీయ భద్రతా మాసోత్సవాల్లో వాకథాన్‌లో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు అన్నారు. జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం చిత్తూరు నగరంలోని దర్గా సర్కిల్ నుండి గాంధీ సర్కిల్ వరకు నిర్వహించిన వాకథాన్ ర్యాలీని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు చాలా విలువైనవని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరు హెల్మెట్

ధరించి వాహనాలను నడపాలని పిలుపునిచ్చారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపడం ద్వారా కొద్దిపాటి గాయాలతో ప్రమాదం నుండి బయటపడే అవకాశం వుంటుందన్నారు. రోడ్డు భద్రతలో భాగంగా చిత్తూరు నగరంలో రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించడంలో పోలీసు వారికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు, జిల్లా రవాణా అధికారి నిరంజన్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శివయ్య పండగను విజయవంతం చేద్దాం!!

శ్రీకాళహస్తి,జనవరి 22 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరుని 13రోజుల పండగను అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి విజయవంతం చేద్దామని బుధవారం పరిపాలనా భవనాల్లోని సమావేశం హాలులో జరిగిన వివిధ శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది, అధికారుల సమీక్షాసమావేశంలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్, ఇఓ బాపిరెడ్డి, ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులకు సూచించారు. ఇఓ బాపిరెడ్డి పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిదులుగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఉన్న ప్రతిపాదనలపై సమీక్షించారు. తిరుపతిలో ఇటీవల జరిగిన సంఘటనలతో రాబోవు శివరాత్రి సందర్భంగా సిసి కెమెరాలు, డ్రోన్‌లను ఉపయోగించాలని సూచించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు శివరాత్రిలో తమకు గుర్తింపు లేదని,దర్శనాలకు కూడా నోచుకోవటం లేదని సమావేశంలో వివరించారు. దాంతో తర్జన

సమీక్షా సమావేశంలో సుధీర్ఘ చర్చ

భర్జనల తరువాత ఆలయంలోని అంతరాలయ దర్శనానికి మాత్రమే దేవస్థానం పాస్‌లు జారి చేసేటట్లు నిర్ణయించారు. ఇతర శాఖల వారికి డ్యూటీ పాస్‌లను ఆర్‌డిఓ అందిస్తారని నిర్ణయించారు.

పార్కింగ్ ఎక్కడ ఏర్పాటు చేయాలి?

శివరాత్రి పర్వదినాన వచ్చే వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలన్న అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. అయితే ఎంజిఎం పక్కనే స్వర్ణముఖి నదిలో ఏర్పాటు చేయటం గతంలో జరిగిందన్నారు.అయితే నదిలో నీరు నిల్వ ఉంచాలని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సూచించారు. మరి పార్కింగ్‌ఎక్కవ చేయాలన్న అంశం తరువాత నిర్ణయిద్దామని నిర్ణయించారు.ఇక పట్టణంలోని మున్సిపల్ రోడ్లు స్వామి అమ్మవార్ల ఉరేగింపులకు అంతరాయం లేకుండా చేయాలని ఎంఎల్‌ఏ సూచించారు. జయరామారావు వీధి నుంచిఎన్‌టిఆర్ నగర్, తెలుగుగంగ కాలనీ రోడ్డు మున్సిపాలిటికి సంబంధించినదని కానీ ఈ రోడ్డు బాగా లేదని మున్సిపల్ అదికారులు స్పందించాలన్నారు. ఇక ఐసిడిసి అధికారులు బాల్యవివాహాలపై ప్రత్యేక దృష్టి సారించి కట్టడి చేయాలన్నారు. రథోత్సవానికి సంబందించిఆర్‌అండ్‌బి అధికారులు నాలుగుమాడావీధుల్లో రోడ్లు పరిస్థితిని గమనించాలన్నారు. ఈ సమీక్షలో మున్సిపల్ కమిషనర్ బి.యస్‌గిరికుమార్, డిఇఇసంజీవ్‌కుమార్,సిడిపిఓ శాంతిదుర్గ,డిఎస్‌పిలు రవిమనోహారి, వెంకటరావు,డివైయస్‌పి నరసింహామూర్తి,సిఐలు డి.గోపి,తహశీల్దార్ లక్ష్మీనారాయణ,ఎంపిడిఓ రఫీఖాన్,ఇరిగేషన్ ఎస్ఇ మదనగోపాల్,విద్యుత్‌శాఖ అధికారులు సుబ్రమణ్యం,ఆర్‌అండ్‌బి,ఎక్సైజ్ సిఐ లావణ్య అగ్నిమాపక శాఖ, మెడికల్ శాఖ అధికారులు,అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.కాగా ఆలయ అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామినాథన్,ప్రధానార్చకులు సంబందం గురుకుల్ కరుణాకర్ గురుకుల్, అచ్చితాస్వామి,దేవస్థానం ఇఇ మురళీధర్‌రెడ్డి,డిఇఇ శ్రీనివాసులురెడ్డి సూపరింటెండెంట్ శ్రీహరి, ఎఇఓలు హేమమాలిని,కస్తూరి, లోకేస్‌రెడ్డి,టెంపుల్ ఇన్స్పెక్టర్లు, విఎస్‌ఓ నాగభూషణం యాదవ్, విజయసారధి, రవి తదితరులు పాల్గొన్నారు.

భారీగా డిఎస్పీలకు పదోన్నతులు

అదనపు ఎస్పీలుగా ముగ్గురు కొలువులు

తిరుపతి,జనవరి 22ప్రభాతవార్త:
రాష్ట్రపోలీసుశాఖలో జంబోటీమ్‌గా 2014-15, 2018-19 మధ్యకాలంలో డిఎస్పీలుగా పదోన్నతి పొంది వివిధ సబ్‌డివిజన్లలో పనిచేస్తున్న పలువురు అదనపు ఎస్పీలుగా అవకాశం లభించింది. ఈ జంబో టీమ్‌లో ఇప్పటికే కొందరు ఉమ్మడిచిత్తూరుజిల్లాలో అదనపు ఎస్పీలుగా బాధ్యతలు నిర్వహిస్తుండగా, కొందరు డిఎస్పీలుగా రిటైర్డ్ అయిన వారు ఉన్నారు. తాజాగా డిజిపి ద్వారకాతిరుమలరావు ఆదేశాలతో అదనపు ఎస్పీలుగా పదోన్నతి జాబితాలో ఉన్న అధికారుల వివరాలు వెల్లడించారు. వీరంతా రాష్ట్రంలో 2015నుండి 2019 మధ్యకాలంలో సిఐల నుండి డిఎస్పీలుగా పదోన్నతి పొందిన వారే. ఇప్పటికే అదనపు ఎస్పీలుగా పదోన్నతి పొంది విధులు నిర్వహిస్తున్న వారిలో కే.జనార్ధన్‌నాయుడు... ట్రాన్స్‌కో (తిరుపతి), ఐ.రామకృష్ణ... లాఅండ్‌ఆర్డర్ (తిరుమల), కే.రవిమనోహరచారి,లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ (తిరుపతి) ఉన్నారు. కాగా ప్రస్తుతం డిఎస్పీలుగా వివిధ చోట్ల పనిచేస్తూ అదనపుఎస్పీలుగా పదోన్నతిజాబితాలో ఉన్నవారిలో బి.సదాలక్ష్మి ,టిటిడి విఎస్‌ఓ (తిరుపతి), వై.మల్లేశ్వరరెడ్డి వెయిటింగ్,వై.జస్సీ ప్రశాంతి .. ఏసిబి (తిరుపతి), ఎం.శ్రీలత.. మహిళ (తిరుపతి),ఎం.రాజగోపాల్‌రెడ్డి ....పిటిసి (తిరుపతి),ఎ.పద్మలత.. సిఐడి తిరుపతి,షానూషేక్.... పిటిసి తిరుపతి,ఎస్ఆర్‌సి హర్షిత....డిఎస్ఆర్‌పి తిరుపతి, జి.మురళీధర్ ...డిఎస్ఆర్‌పి నెల్లూరు,జివిఎస్ పైడేశ్వర రావు... శ్రీసిటీ, జె,వెంకటనారాయణ... వెయిటింగ్ ఉన్నారు. వీరేగాక డిఎస్పీలుగా రిటైర్డ్ అయి తాజాగా పదోన్నతిపొందిన అధికారుల్లో బి.నరసప్ప (వెస్టు డిఎస్పీ రిటైర్డ్), యు.సూర్యనారాయణ ,రిటైర్డ్ కడప, వి.గిరధర్...డిటిసి చిత్తూరు, ఎ.రామచంద్ర...రేణిగుంట ఉన్నారు.

బాలరాముడుతోనే దేశంలో నవశకం

పుంగనూరు, జనవరి 22, ప్రభాతవార్త

అయోధ్యలో బాలరాముని పునః ప్రతిష్ట తర్వాతభారతదేశంలో నవశకం ఆరంభ మైందని నవశకం ఆరంభమైందని బిజెపి పార్లమెంటరీ విభాగ నాయకుడు సిఎస్ రాజారెడ్డి అన్నారు. అయోధ్యలో రామాలయం ప్రతిష్ట జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా బిజెపి నియోజకవర్గ కన్వీనర్ గన్నా మదన్మోహన్ బాబు ఆధ్వర్యంలో పట్టణంలో బిజెపి పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించుకున్నారు. కనుక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రాముడు చిత్రపటానికి పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు. భారతదేశంలో దేవాలయాలను కొల్లగొట్టి ఇతర ప్రార్థన ఆలయాలు నిర్మించుకున్న చరిత్రను తిరగరాసి అలనాటి దేవాలయాలు పునరుద్ధరిస్తామని నాయకులు ప్రతిజ్ఞ పునారు. రాష్ట్ర ఏబీవీపీ నాయకులు టీవీఎస్ ప్రసాద్, ఆర్ఎస్ఎస్ నాయకుడు త్రిమూర్తి రెడ్డి, హైందవ సంఘాలు ప్రజలు పాల్గొన్నారు.

పరశురామేశ్వరాలయం అభివృద్ధికి ప్రత్యేక నిధులుమంజూరు చేయండి

శ్రీకాళహస్తిరూరల్,జనవరి 22 ప్రభాతవార్త

చారిత్రక,పురావస్తు శాఖ పరిధిలో ఉన్న పరశురామేశ్వరాలయం అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్‌ను గుడిమల్లం అలయానికి తీసుకెళ్ళి అక్కడ శివరాత్రి లోపల చేపట్టాల్సిన అభివృద్ధికి సంబందించి చర్చించారు. గుడిమల్లం పురాతనమైన ఆలయమని ఎంతో కాలంగా నిధులు మంజూరు చేయాలని కోరారు.రోడ్డు సదుపాయం సరిగా లేనందువల్ల టూరిజం బస్సులు కూడా నడవలేని పరిస్థితి చోటు చేసుకుంది. ఇక శివరాత్రికి సంబంధించి శ్రీకాళహస్తి నుంచి గుడిమల్లం కు ఉచిత బస్సును నడపాలని అందుకు ఆర్‌టిసి మేనేజ్‌మెంట్‌ను ఆదేశించాలని కోరారు. కాగా ఆలయం ఉరుస్తుందని మరమ్మత్తులు చేయాల్సి ఉందని కోరారు. ఇక ఆలయ పరిసరాల్లో చక్కటి వాతావరణం కల్పించుటకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇక్కడకు దేశ విదేశాల నుంచి భక్తులు వస్తుంటారని కాబట్టి వారికి సదుపాయంగా అతిథి గృహాలు నిర్మించుటకు ప్రణాళికలు రూపొందించాలని కోరారు.ఈ సందర్భంగా గోవింద వరంవద్దస్వర్ణముకి నది వంతెనను పరిశీలించారు. వారితో పాటు ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి పాల్గొ న్నారు. ***ఘనస్వాగతం:*** గుడిమల్లం ఆలయానికి సంబంధించిన అభివృద్ధిని చేపట్టుటకు గుడిమల్లం ఆలయానికి వచ్చిన ఎంఎల్‌ఏ కలెక్టర్‌కు ఆలయ చైర్మెన్ గిరిబాబునాయుడు,ఇఓ రామచంద్రారెడ్డి,మండల నాయకులు ధనంజయులు నాయుడు,శ్రీకాళహస్తి మార్కెటింగ్ కమిటి మాజీ చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు,నాగరాజ నాయుడు పాల్గొన్నారు.

మహిళపై పెట్రోలు పోసిన భర్త

శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త

పట్టణంలోని పెద్దమసీదువీధిలో నివాసం ఉంటున్న ఓ మహిళపై భర్త పెట్రోలు పోసి నిప్పటించిన సంఘటన చోటుచేసుకుంది. పెద్దమసీదులో ఉన్న ఓ మహిళ బుధవారం ఉదయం ఇంటిముందు దుస్తులు ఆరేస్తుండగా భర్త వచ్చి పెట్రోలు పోసి హఠాత్తుగా నిప్పటించడంతో ఆమె శరీరం కాస్తా కాలిపోయింది. దీంతో ఆమె హుటిన పక్కనే ఉన్న నీటిని పోసుకోవడంతో మంటలు ఆరిపోయాయి. దీంతో మిద్దెపైన ఉన్న మనుమరాలు చూసి బంధువులకు సమాచారం అందించింది. వారు హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేసిన అనంతరం ఇంటికి తీసుకెళ్ళారు. అయితే ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి పిర్యాదు అందలేదు.

శివయ్య సన్నిధిలో రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ ఛైర్మన్

శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కార్పొ ేంషన్ ఛైర్మన్ బి.శ్రీనివా సులు శివయ్యదర్శనానికి విచ్చేశారు. ఆయనకు తిరుపతి పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆయనకు దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలు అందించారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు రమేష్, పట్టణ తెదేపా ప్రధాన కార్యదర్శి వజ్రంకిషోర్, మరియు తిరుపతి జిల్లా ఎస్టీ విద్యార్థుల సంఘ నాయకుడు సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాకేష్ కుటుంబానికి ప్రభుత్వ సాయం రూ.10 లక్షలు అందజేత

చంద్రగిరి, జనవరి 22 ప్రభాతవార్త: కందులవారిపల్లి ఉప సర్పంచ్ మారుపూరి తరేష్‌బాబు (రాకేష్ చౌదరి) కుటుంబానికి ఎంఎల్‌ఏ పులివర్తి నాని కుటుంబం అండగా వుంటుందని ఎంఎల్‌ఏ సతీమణి పులివర్తి సుధారెడ్డి పునరుద్ఘాటించారు. రాకేష్ మృతితో తీవ్ర మనోవేదనకు గురైన కుటుంబ సభ్యులను బుధవారం ఆమె అటవీశాఖ అధికారులతో కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని కందులవారిపల్లి, మామిడిమాను గడ్డకు చెందిన ఉప సర్పంచ్, ఐటిడిపి మండల అధ్యక్షుడు రాకేష్ చౌదరి నారావారి కుటుంబానికి, తెలుగుదేశం పార్టీకి అత్యంత విధేయుడుగా వుంటూ ఈ ప్రాంత ప్రజలకు తనవంతు సేవలందించే రాకేష్ మృతి తెలుగుదేశం పార్టీకి, పంచాయతీ ప్రజలకు తీరనిలోటును మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులదాడిలో రాకేష్ మృతి చెందడంపై ఎంఎల్‌ఏ పులివర్తి నాని సమాచారాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం కొణిదల పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాకేష్ కుటుంబానికి ప్రభుత్వ సాయంగా రూ.10 లక్షలు అందించినట్లు తెలిపారు. ఆ మేరకు అటవీశాఖ అధికారులతో కలసి రాకేష్ కుటుంబ సభ్యులకు చెక్‌ను అందజేశారు. టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, పాల్గొన్నారు.

అడుసుపల్లికి తీరిన తాగునీటి సమస్య

సోమల, జనవరి 22, ప్రభాతవార్త

సోమల పంచాయతీ అడుసుపల్లి బుంగ వారి పల్లి గ్రామాలకు గత కొద్దిరోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామ కార్యదర్శి మజహర్ సమస్యను గుర్తించి ఉన్నతాది. కారులు తెలియజేయడంతో వారి సూచనతో గ్రామంలో బోర్ డ్రిల్లింగ్ పనులు బుధవారం ప్రారంభించారు. మంచినీళ్లు సమృద్ధిగా లభించడంతో గ్రామస్తుల సంతోషానికి అవధులు లేకుండా పోయింది. ఈ కార్యక్రమంలో శెట్టి వారి సదా శివయ్య, గుమ్మ నాగరాజా, గౌత కట్ల దామోదరం, సాగునీటి సంఘ వార్డు మెంబర్ రమేష్, శివలింగ, మురళి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పం ప్రజలపై కరుణించిన రైల్వే ఉన్నతాధికారులు

కుప్పం, జనవరి 22 ప్రభాతవార్త

అమృత్ భారత్ పథకంలో భాగంగా కుప్పం రైల్వేస్టేషన్ అభివృద్ధితో పాటు మూడో ప్లాట్‌ఫామ్ నిర్మాణ పనులు చేపడుతున్న దృష్ట్యా కుప్పంలో తొలుత రైళ్ల స్టాపింగ్‌లు రద్దు చేసిన రైల్వే ఉన్నతాధికారులు కుప్పం ప్రజలు, ప్రయాణీకులపై కరుణించారు. కుప్పం నుంచి బెంగళూరు మధ్య తిరిగే పుష్‌పుల్ రైలును యధావిధిగా కొనసాగించడంతో పాటు పలు రైళ్లకు కుప్పంకు బదులు మల్లానూరులో స్టాపింగ్ కేటాయించారు. దీంతో ప్రయాణీకులకు కొంత ఇబ్బందులు తప్పాయి. అంతకుముందు ప్రయాణీకుల ఇబ్బందులపై రైల్వే ఉన్నతాధికారులను సాయిమాతా సేవా ట్రస్ట్ జగదీష్‌బాబు కలసి వివరించారు. ఈ నేపథ్యంలో రైళ్ల స్టాపింగ్‌కు అధికారులు అనుమతించడం పట్ల ఆయన సిఎం చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్, డిసిఎం పవన్ కళ్యాణ్, ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రైల్వే జిఎం అరవింద్ శ్రీవాత్సవ, డిఆర్ఎం అమితేష్‌కుమార్ సిన్హా, డిఎం కృష్ణారెడ్డిలకు జగదీష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

టోల్‌గేట్ వద్ద తగాదా.. నలుగురిపై కేసు నమోదు

వి.కోట, జనవరి 22 ప్రభాతవార్త

మండలంలోని దానమయ్యగారిపల్లి వద్ద ఉన్న టోల్‌గేట్ వద్ద జరిగిన తగాదాకు సంబంధించి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సిఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఖాజీపేటకు చెందిన అద్నాన్ అతని బంధువులు కారులో వి.కోట వైపు రాగా అతను తన కారును ఎలాంటి రుసుం లేకుండా వదలాలని అక్కడ సిబ బందితో గొడవకు దిగా వారిపై దాడి చేశారని టోల్‌గేట్ మేనేజర్ రామాంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

చౌడేపల్లి, జనవరి 22 ప్రభాతవార్త

అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు...చౌడేపల్లి బస్టాండులోని బస్‌షెల్టర్‌కు సమీపంలో అక్రమ మద్యం బెల్టుదుకాణాలు వున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. ఈదాడిలో పెద్దపంజాణి మండలం నగిరేపల్లికి చెందిన కరుణాకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని అతని నుంచి 24క్వార్టర్ బాటిళ్ళ ఎపి లిక్కర్‌ను స్వాధీన పరచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పెన్షన్ల ఏరివేత ప్రక్రియ వేగవంతం

– పాలసముద్రం మండలంలో 41 మంది లబ్దిదారులను తనిఖీ చేసిన అధికారులు

పాలసముద్రం, జనవరి 22 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పెన్షన్ల లబ్దిదారుల కుదింపు చర్యల ప్రక్రియ వేగవంతం చేసింది. క్షేత్ర స్థాయిలో సామాజిక పెన్షన్లలో భాగంగా అత్యధిక మొత్తం పొందుతున్న లబ్దిదారుల స్థితి గతులు, వారికి వున్న జబ్బు, వారి వద్ద వున్న ఆరోగ్య సర్టిఫికేట్లు తదితరాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు. పాలసముద్రం మండల పరిధిలో అధికారుల బృందం ఇప్పటికే 41 మంది పెన్షన్ లబ్దిదారులను తనిఖీ చేసింది. పక్షపాతం, కిడ్నీ రోగులకు సంబంధించి మండల పరిధిలో మొత్తం 41 మంది లబ్దిదారులు వున్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెల పెన్షన్ మొత్తం కింద రూ.15 వేలు చెల్లిస్తోంది. అధికారుల బృందం బుధవారం మండల పరిధిలోని పాలసముద్రం పంచాయతీ, బాలకృష్ణాపురం పంచాయతీల్లోని పెన్షన్ లబ్దిదారులను తనిఖీ చేశారు. ఈ మేరకు పెన్షన్‌దారుల స్థితిగతులను పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదిక ఇవ్వడం జరుగుతుందని డాక్టర్ల బృందంలోని డాక్టర్లు శివరామ్, అమృతలు పేర్కొన్నారు. డాక్టర్లు కృష్ణకుమార్, సూర్యుడు, విజయ్‌కాంత్, అరుణకుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణాచారి

తిరుపతి కార్పొరేషన్, జనవరి 22, ప్రభాతవార్త

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణాచారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డిఎస్పి మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు అన్నారు. జిల్లా ఇంచార్జి ఎస్పి మణికంఠ చందోలు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి, కేసుల వివరాలు వెల్లడించారు. తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 11 మంది ముద్దాయిలను 4వఅదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టుకు హాజరు పరచగా జడ్జి గ్రంథి శ్రీనివాస్ తీర్పు నిచ్చారు. ఒక్కొక్కరికి 10,000 చొప్పున మొత్తం 11 మందికి 1,10,000 జరిమానా విధించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఇంచార్జి ఎస్పి మణికంఠ చందోలు అభినందించినారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండ బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్గివుండాలి

పందిళ్ళపల్లి(చౌడేపల్లి), జనవరి 22 ప్రభాతవార్త

పశువుల్లో శాస్త్రీయ యాజమాన్యంపై పాడి రైతులకు అవగాహన వుండాలని పశు వైద్యాధికారి పవన్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పంచాయతీ పరికిదొనలో పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసారు. మేకలు, గొర్రెలకు 2వ విడత నట్టల నివారణ మందులు పంపిణీ చేసారు. వీటితోపాటు పశువు లకు సోకే గర్భకోశ వ్యాధులు, చూడి నిర్ధారణా పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించారు. పశువుల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఆవులు, గొరెలు, మేలకు భూటాక్స్ స్ప్రే చేశారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్, సిబ్బంది అనూషా, మౌనిక, రామకృష్ణ, పాడి రైతులు పాల్గొన్నారు.

నిజాయితీ ఓటు - దేశ ప్రగతికి చోటు

చౌడేపల్లి, జనవరి 22 ప్రభాతవార్త

నిజాయితీ ఓటు దేశ ప్రగతికి చోటని ప్రధా నోపాధ్యాయుడు నాగరాజరెడ్డి అన్నారు. ఈనెల 25న జరగబోయే ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఉన్నతపాఠశాలలో మండల స్థాయిలోని పాఠశాలల వి ద్యార్థులకు ఓటుయొక్క ప్రాధాన్య తపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా విద్యార్థులకు సమాజ నిర్మాణంలో ఓటు ప్రాధాన్యతపై వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఓటర్ల దినోత్సవం రోజున ప్రోత్సాహకాలంది స్తామన్నారు. ఉపాధ్యాయులు మోహన్, మురళి, సురేంద్ర, ఈశ్వర్, మధుసూదన్‌రెడ్డి, ఆనంద, ఉమాకుమార్‌రెడ్డి, కవిత, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత సైనికుల సభకు రండి : చల్లాకు పిలుపు

పుంగనూరు, జనవరి 22, ప్రభాతవార్త

ఈ నెల 26న పట్టణంలో నిర్వహించే మాజీ సైనికుల సభకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని దేశం ఇన్చార్జి చల్లా బాబుకు మాజీ సైనికులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఉదయం చల్లా బాబును ఆయన స్వగృహంలో నియోజకవర్గ మాజీ సైనికుల సంఘం కలిసింది. విశ్రాంతి డిఎస్పి మాజీ సైనికుల సంఘం నాయకులు ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు రెడ్డప్ప, వైస్ ప్రెసిడెంట్ జవహర్, సెక్రెటరీ ప్రతాప్, ఈసీ మెంబర్ సుబ్రహ్మణ్యంలు చల్లా బాబును కలిశారు. ఈ 26వ తేదీ రిపబ్లిక్ డే సందర్భముగా మాజీ సైనికుల కమ్యూనిటీ అవును వద్ద జాతీయ జెండా ఆవిష్కరణకు రావాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. రామపల్లిలో ఉన్న మాజీ సైనికుల కమ్యూనిటీ హాల్ నందు రిపబ్లిక్ డే సందర్భంగా ప్రజలందరూ రావాలని కోరారు.

పలు పాఠశాలల్లో రాష్ట్ర బృందం తనిఖీ

పుంగనూరు రూరల్, జనవరి 22, ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం సామాజిక తనిఖీలు జరిగాయి.సర్వశిక్షఅభియాన్ నుంచి స్టేట్ రిసోర్స్ పర్సన్ బుజ్జి, డి ఆర్ పి కిరణ్ కుమార్, రమేష్‌లు బృం దంగా కొత్త ఇండ్లు మున్సిపల్ హై స్కూల్, అడవినాథు నికుం టలోని మోడల్ స్కూల్, నక్కబండలోని కేజీబీవీ పాఠశా లలో ఈ తనిఖీలు చేశారు. విద్యార్థుల తల్లి దండ్రులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.విద్యార్థులతోకాసేపుమాట్లాడారు

రేపటినుంచి మల్లానూరు స్టేషన్‌లో ఆగనున్న రైళ్లు

కుప్పం, జనవరి 22 ప్రభాతవార్త

కుప్పం రైల్వే స్టేషన్‌లో మూడో ప్లాట్‌ఫామ్ నిర్మాణపనుల దృష్ట్యా ఈనెల 24వతేది నుంచి మండలంలోని మల్లానూరు రైల్వేస్టేషన్‌లో కుప్పంకు బదులుగా పలు రైళ్లకు రైల్వే ఉన్నతాధికారులు స్టాపింగ్ ఇచ్చారు. మల్లానూరు రైల్వే స్టేషన్‌లో తిరుపతి – నర్సాపూర్, కోయంబత్తూర్ డబుల్ డెక్కర్, చెన్నై డబుల్ డెక్కర్, బృందావన్, మైసూర్, లాల్‌బాగ్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి – బెంగళూరు ఇంటర్ సిటీ, మంగళూర్ –యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలిక స్టాపింగ్ ఇచ్చారు. 15 రోజుల పాటు వీటిలో పలురైళ్లు ఫిబ్రవరి 8వరకు మల్లానూరు స్టేషన్‌లో ఆగనున్నాయి.

సెవెన్ హిల్స్ విద్యార్థులకు అభినందనలు

రామచంద్రాపురం, జనవరి 22 ప్రభాతవార్త:

వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ విద్యార్థిలను పలువురు అభినందించారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో జరిగిన వక్తృత్వపోటీలలో ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్న విద్యార్థులను బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామీ వివేకానంద 163వ జయంతి వేడుకలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఫార్మశీ రంగానికి ఉజ్వల భవిష్యత్ వుందనీ, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా వున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతపై అధ్యాపక, ఉపాధ్యాయులతో అవగాహన

తొట్టంబేడు, జనవరి 22 ప్రభాతవార్త

తిరుపతి, చిత్తూరు జిల్లాల సమన్వయకర్త ఎం. ఈ. గీత ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ మీడియట్ విద్యార్థులకు విద్యనేర్పిస్తున్న అధ్యాపక, ఉపాధ్యాయ సిబ్బందితో ఉదయం నుంచి సాయంత్రం వరకు అవగా హన సదస్సును డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో లాంగ్వేజెస్ మరియు నాన్ లాంగ్వేజెస్ వందశాతం ఫలితాలు మరియు అత్యధిక సగటు స్కోర్ కోసం చేపట్టాల్సిన వివిధ సాధనాల గురించి చర్చించారు. విశ్రాంత హిందీలో ఎ.చంద్రశేఖర్‌గుప్తా మాట్లాడుతూ ఎక్కువ మార్కులు సాధనకు హిందీ ఉపాధ్యాయులకు తగిన సూచనలు అందించారు. ప్రముఖ మోటివేషన్ స్పీకర్ గోపి తమ విలువైన ప్రసంగంతో వందశాతం ఫలితాలు సాధించడంలో ఉన్న ఒత్తిడిని తగ్గించుకుని ఉపాధ్యాయులు ముందుకు సాగాలని అందరినీ చైతన్య పరిచారు.

తిరుపతి డివిజన్

నిబంధనలు అతిక్రమించొద్దు

–నిర్దేశిత ప్రాంతంలోనే వ్యాపారాలు చేసుకోవాలి

తిరుమల, జనవరి 22 ప్రభాతవార్తప్రతినిధి: భక్తుల సేవపేరుతో రకరకాల దుకాణాలు ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్న వ్యాపారులు తమకు కేటాయించిన స్థలం లోగాక అదనంగా స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై టిటిడి రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు హెచ్చరికలు చేశారు. దుకాణాల స్థలాలను అతిక్రమించి ఆక్రమణలను బుధవారం రెవెన్యూ అధికారులు తోలగించారు. దుకాణాదారులు తమకు కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేసుకోవాలని ఆదేశించారు.

బంగారుపతకం అందుకున్న చిన్నారి కుందన

తిరుపతి(రవాణా),జనవరి 22ప్రభాతవార్త:

కరాటేలో తనదైన ప్రతిభను చూపిన చిన్నారి పి.కుందన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ రైజింగ్ స్టార్ మార్షల్ ఆర్ట్ పోటీల్లో బంగారుపతకం కైవశం చేసుకుంది. మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో తిరుపతికి చెందిన చిన్నారి కుందన తనదైన శైలిలో ప్రతిభచాటి బంగారుపతకంతో మెరిసింది. ఈ పతకాన్ని సతీష్‌మనోహర్ విశిష్టఅతిథిగా పాల్గొని అందజేశారు. చిన్నారికి మాస్టర్ శేఖర్ శిక్షణనిచ్చాడు. తిరుపతికి చెందిన పివి చక్రధర్, ప్రతిభసాగర్ కుమార్తె. ఎంతో నైపుణ్యం కనబరచిన చిన్నారిని పలువురు క్రీడాకారులు, అభిమానులు అభినందించారు.

అన్నాక్యాంటీన్‌కు ఈశ్వర్‌రెడ్డి విరాళం

తిరుపతి(రవాణ), జనవరి 22 ప్రభాతవార్త:

రాష్ట్రమంత్రి, యువనేత నారాలోకేశ్ జన్మది నాన్ని పురస్కరించుకుని తిరుపతికి చెందిన శుభం ఈవెంట్స్ అధినేత ఆవుల ఈశ్వర్‌రెడ్డి అన్నాక్యాంటీన్‌కు విరాళం అందించాడు. చెక్కు రూపంలో ఇటీవల మంత్రి లోకేశ్‌ను కలసి అందించడం సంతోషంగా ఉందన్నారు. టి.సుమంత్‌చౌదరి, ఆర్ రవినాయుడు, ఆవుల ఈశ్వర్‌రెడ్డి సంయుక్తంగా ఈ విరాళాన్ని మంత్రికి అందజేశారు.

తెలుగువారికి మరపులేని నటుడు అక్కినేని

తిరుపతి, జనవరి 22 ప్రభాతవార్త: పౌరాణిక,సాంఘిక,ప్రేమకథ చిత్రాలతో తనదైన శైలిలో అద్భుతంగా నటించి తెలుగుప్రజలకు మరచిపోలేని నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి అన్నారు. అక్కినేని వర్ధం తిని బుధవారం రంగస్థలి కార్యాల యం లో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో రంగస్థలి కళాకారులు కెఎన్ రాజ, సుబ్రమణ్యంరెడ్డి, జయలక్ష్మీ, లీలావతి, కుమార్‌రాజరెడ్డి, హనుమంతరావు, రాధాకృష్ణారెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రిపబ్లిక్ క్లబ్‌లో టెన్నిస్‌కు జీవం

శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిపట్టణనడిబొడ్డులో రాజుల కాలం నాటి రిపబ్లిక్ క్లబ్‌లో టెన్నిస్ పోటీలను బుధవారం పునఃప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా క్లబ్‌లో టెన్నిస్ పోటీలు నిర్వహించటం లేదు. గతంలో అంతర్జాతీయ,జాతీయ స్థాయిలో టెన్నిస్ పోటీలు నిర్వహించి శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలనుఇనుమడింప జేసారు.అయితే వివిధ కారణాలతో టెన్నిస్‌టోర్నమెంట్‌లను నిర్వహించలేదు.అయితే యువ క్రీడాకారులు చొరవ చూపి బుధవారం నుంచి టెన్నిస్‌ను పునఃప్రారంభించారు. దాంతో టెన్నిస్ క్రీడాకారులకు కొత్త ఉత్సాహం చోటు చేసుకుంది.

సాంస్కృతిక వేదిక ఏర్పాటు

శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబులు యుద్ధ ప్రాతిపదికపై చక చకా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజగోపురం పక్కనే ఏర్పాటు చేయనున్న ధూర్జటి కళాప్రాంగణం వేదిక రూపకల్పనకు సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది ఇక్కడ వేదిక స్క్రిన్‌ను రూ.7లక్షలతో రూపకల్పన చేసారు.ఈ ఏడాది గతం కన్నా భిన్నంగా రూపొందించుటకు పనులు అప్పగించారు. పానగల్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రతాప్ అనే యువకుడు కళావేదికను రూపకల్పన చేసారు.మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కీలక కార్యక్రమాలు సాంస్కృతిక కార్యక్రమాలు.గతంలో సన్నిధివీధిలోని ప్రస్తుత కార్‌పార్కింగ్ వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసే వారు.కానీ భక్తులకు అందుబాటులో స్థానికులు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు వీలుగా కళావేదిక వెనుక సీన్‌ను రూపొందించారు. ఈ సారి ధ్యాన శివుడు,శివలింగం, శ్రీ-కాళ-హస్తిలతో పాటు మూఢభక్తితో తన కన్నులను ఇచ్చిన భక్త కన్నప్ప, వెనుక కైలాసగిరి పర్వత పంక్తులను రూపకల్పన చేసారు.

ప్రత్యేక నిధులు మంజూరుచేసి అభివృద్ధికి ఆదుకోండి

శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాల నిశాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్‌ను అభ్యర్థించారు.బుధవారం ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న చెరువులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు.అలాగే శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో స్వర్ణముఖి ఆధునీకరణకు సంబంధించి గతంలో వెచ్చించిన నిధులను కలెక్టర్‌కు వివరించారు.అలాగే శ్రీకాళహస్తి పట్టణంలోని మైనారిటి ముస్లింలకు ఈద్‌గాహ్ అభివృద్ధికి సంబందించి మొదటి విడతలో రూ.60లక్షలు నిదులు మంజూరు చేయాలని కోరారు.అలాగే గ్రామీణ అభివృద్ధికి సంబంధించి పలు గ్రామాల్లో రోడ్లకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని కోరగా రోడ్లకు నిధులు మంజూరుకు కలెక్టర్ భరోసా ఇచ్చారు.గ్రామాల్లో అంగన్‌వాడిలు రెవెన్యూ సమస్యలకు సంబంధించి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి విన్నవించగా అన్ని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. పలు సమస్యల పరిష్కారానికి ఆర్‌డిఓకు ఆదేశించారు.అలాగే మట్టిలో కలసి పోయే కవర్లు, గ్లాసులును తీసుకోవాలని తయారి దారులు తెచ్చిన నమూనాలను కలెక్టర్,ఇఒకు చూపారు.కాగా శ్రీకాళహస్తీశ్వరాలయం అభివృద్ధికి సంబంధించి తమ ఇళ్ళను అందించిన బాధితులకు ఇళ్ళ స్థలాలను ఇప్పించాలన్నారు.వారికి లోబావిలో రెండు ఎసెంట్లు అందించాలనికోరారు. అయితే బాధితులు తమకు దేవస్థానంలో దుకాణాలను ఇవ్వాలని కోరగా అది సాధ్యం కాదని సూచించారు.

రేషన్‌కి కావాలంటే 4 కిమి వెళ్ళాల్సిందేనా..!

శ్రీకాళహస్తి రూరల్, జనవరి 22 ప్రభాతవార్త

ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరకులు కావాలంటే చెరువుకట్ట మీద నాలుగుకిలో మీటర్లు నడిచి వెళ్ళాల్సి వస్తుందని ఈ సమస్యను ఎంతో కాలంగా రెవెన్యూ అధికారుల దృష్టికి తెస్తున్నా పట్టించుకోవటం లేదని మాజీ మండల ఉపాధ్యక్షుడు తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ద్వారా జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. మండలంలోని పాతగుంట గ్రామపంచాయితీలో అమ్మచెరువు,తిమ్మవరం,తిమ్మవం హరిజనవాడ గ్రామస్థులు రేషన్ తీసుకోవాలంటే ప్రతి నెల 4 కిమీదూరం వెళ్ళాల్సివస్తుందని మాజీ మండల ఉపాధ్యక్షుడు తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కి డాక్టర్ వెంకటేశ్వర్‌కి,శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి వినతి పత్రం అందించారు.పంచాయితీలోని ప్రజలు ప్రతి నెల రేషన్‌కి వెళ్లాలంటే కనీస రోడ్డు మార్గం కూడా లేకుండా చెరువు కట్టమీద వెళ్ళాల్సిన దుస్థితి ఏర్పడింది.ప్రజలు నానా అవస్థలు పడి ఇబ్బందులకు గురవుతున్నారని అలాగే పాతగుంటరేషన్ షాపును విడదీసి తిమ్మవరం గ్రామానికి రేషన్ షాపులు కేటాయిస్తే 3 గ్రామాల ప్రజలు ఇబ్బందులు లేకుండా ఉంటారని కలెక్టర్‌ను విన్నవించుకున్నారు.అనంతరం కలెక్టర్ స్పందిస్తూ ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డికి వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతానని హామి ఇచ్చారు.

ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాళహస్తి జనవరి 22 ప్రభాతవార్త

ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రో చైల్డ్‌గ్రూపు,చైల్డ్‌రైట్స్ ఫోరం వారి ఆర్థిక సౌజన్యంతో బాలికల భద్రత ఆరోగ్యం విద్య పై బుధవారం శ్రీకాళహస్తి డిఎస్పీ నరసింహామమూర్తి చే పోస్టల్‌లు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు బంగారం అని వారి బాల్యాన్ని మనందరి బాధ్యత అని తెలియజేశారు.బాలికల బాధ్యత వారివారితల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.ఈ నెల 24 జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు పాఠశాలలు కళాశాలలు గ్రామలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ సంఘజిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య,రమేష్,ప్రగతి సంస్థ మండల కో ఆర్డినేటర్లు జయలక్ష్మి,సుభాష్‌చంద్రయ్య,ప్రభాకర్ సిబ్బంది రామచంద్రలు పాల్గొన్నారు.

బాలరాముని ఆరాధనమహోత్సవాలు

తిరుపతి, జనవరి 22ప్రభాతవార్త:

అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్టచేసి ఏడాది కాలం పూర్త యిన సందర్భంగా తిరుపతిలో రామభక్తులు, భజనమండలి కళాకారులు వేడుకగా బాలరాముని చిత్రపటం ఉంచి ఆరాధనమహోత్సవాలు జరిపారు. ప్రధాన మోదీ పిలుపుతో రామజన్మభూమి ట్రస్ట్ కోరికమేరకు బుధవారం సాయంత్రం తిరుపతిలో పలువురు కళాకారులు బాలరాముని వేషధారణలో దీపాలు వెలిగించారు. లోకకల్యాణం కోసం, దేశ సుభిక్షంకోసం రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి.

రీసెర్చ్ అసిస్టెంటుకు దరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి విద్య జనవరి 22 ప్రభాతవార్త:

పద్మావతి మహిళా వర్సిటీ వ్యాయామ విద్యావిభాగం ఐసీఎస్ఎస్ఆర్ రీసెర్చ్ ప్రొగ్రాం ఇంటిగ్రేటెడ్ బయో సైకోసోషల్ అప్రోచ్ ఇన్ ఎన్సూరింగ్ వెల్నెస్ ఆమాంగ్ ఉమెన్ ప్రొటెక్షన్ కొరకు రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుకు ధరఖాస్తులను ఆహానిస్తున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి సారాసరోజిని ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి,అర్హత గల అభ్యర్థులు ఈనెల 27లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్సైట్ ను సంప్రదించాలని సూచించారు.

అంతర్జాతీయ సదస్సు విషయ పత్రిక విడుదల

తిరుపతి విద్య జనవరి 22 ప్రభాతవార్త:

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ వృక్ష శాస్త్ర విభాగం,పారంపర్య వైద్య మహా సంఘం సంయుక్తంగా సాంప్రదాయ ఔషధం ఆధునిక, సహజ చికిత్సల ఏకీకృత విధానం అనే అంశంపై ఏప్రిల్ 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నారు.దీనికి సంబంధించిన విషయ పత్రికనూ బుధవారం విసి ఆఫీస్ నందు ఉపకులపతి ఆచార్య అప్పారావు,రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు,సిడిసి డీన్ కెసి రాయుడు,సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కేటీ రామకృష్ణారెడ్డి,ఆచార్య డా.కామేశ్వరరావు బద్రి (యుఎస్ఎ) చేతుల మీదుగా విడుదల చేశారు. సదస్సు కార్య నిర్వాహకురాలిగా డా. జె.కామాక్షమ్మ,ఇతర నిర్వాహకులుగా యు ఎస్ ఎ కి చెందిన ఆచార్యుడు డా. కామేశ్వరరావు బద్రి, నారాయణ మెడికల్ కళాశాల అధ్యాపకుడు పసుపులేటి శ్రీనివాసరావు, ఆచార్య విజయ ఆచార్య నాగలక్ష్మి దేవమ్మ డాక్టర్ ముని కేశవులు వ్యవహరించనున్నారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సంప్రదాయ వైద్యంలో ఉపయోగించే మందుల ఫార్ములాను భవిష్యత్తు తరాలకు అందించడమే ధ్యేయం అన్నారు.ఈ కార్యక్రమంలో వర్సిటీ రీసెర్చ్ ఆచార్య నరసింహ,డెవలప్మెంట్ డీన్ ఆచార్య బాలాజీ, ఆచార్య సరిత తదితరులు పాల్గొన్నారు.

వళ్ళూవన్ కులానికి ప్రాధాన్యత ఇవ్వండి

తిరుపతి విద్య జనవరి 22 ప్రభాత వార్త:

వళ్ళూవన్ కులానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వళ్ళూవన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.శ్రీరాములు మంగళవారం చిత్తూరులో ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రమం కలిసి వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా ఎస్సీ ఉప కులాలలో చిట్ట చివరన ఉన్న వళ్ళూవన్ కులానికి సంబంధించి తమిళనాడులో వళ్ళూవన్ లను ఎస్సీలుగా ఆ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందన్నారు.ఏక సభ్య కమిషన్ వారు కూడా తమ వినుతిపై తగిన విచారణ జరిపి ప్రాధాన్యతను ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కే.మోహన్, పన్నీర్ సెల్వం,సుందర్ రాజన్,మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు తరచూ వైద్య పరీక్షలు చేయించాలి

రేణిగుంట, జనవరి 22 ప్రభాతవార్త:

పెంపుడు జీవాలకు తరచూ వైద్య పరీక్షలు చేయిస్తూ వాటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ శ్రీనివాస్, ట్రస్టు ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్ సంయుక్తంగా అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా పశు వైద్య శిబిరం జరిగింది. రేణిగుంట ఏరియా వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ సునీత, కేవీకే పశు వైద్యులు అనుష బృందం శిబిరానికి వచ్చిన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన పశువులకు ఇంజక్షన్లు టీకాలు వేసి పిడుదలకు సంబంధించిన మందులను స్ప్రే చేశారు. కార్యక్రమంలో రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి, రాస్ సిబ్బంది గిరిప్రసాద్, జ్యోతి, ఇందుమతి, నాగమణి, అన్బగలన్, శంకరయ్య, స్వాతి, క్లస్టర్ లీడర్లు, రైతులు పాల్గొన్నారు.

నెల్లూరులో జరిగే సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

కేవీబీ పురం, జనవరి 22 ప్రభాతవార్త:

సీపీఎం పార్టీ 27వ రాష్ట్ర మహాసభలు సందర్భంగా గోడపత్రికలను కేవీబీ పురంలో బుధవారం సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నెల్లూరు పట్టణంలో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో రాష్ట్ర 27వ మహాసభలు పెద్ద ఎత్తున జరుగుతాయని తెలిపారు. 3వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జరిగే బహిరంగ సభ, ర్యాలీలో వేలాదిగా ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం నాయకుడు నాగరాజు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు పట్టణంలో జరిగే రాష్ట్ర మహాసభలకు సత్యవేడు నియోజకవర్గం నుంచి భారీగా ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

స్వామి వివేకానంద 163వ జయంతి

పుత్తూరురూరల్, జనవరి 22 ప్రభాతవార్త:

పుత్తూరు శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, కటారి మునికృష్ణ, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి వార్డుల్లో చికిత్స పొందుతున్న వారికి పండ్లు, బ్రెడ్, బిస్కెట్లు పంచారు. మానవసేవే మాధవసేవ అనే దృక్పథాన్ని అలవరచుకుని ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రతి ఒక్కరిలో పరమాత్మను దర్శించవలెనని కటారి మునికృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర బ్యాంకు మేనేజర్, ప్రభుత్వాస్పత్రి ప్రధాన వైద్యులు, సిబ్బంది, త్రినేత్ర పిరమిడ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

బుచ్చినాయుడు కండ్రిగ, జనవరి 22 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం పరిపాలనలో సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షతన ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆరణి విద్యనాథరెడ్డి ఎమ్మెల్యేను గజమాలతో ఘనంగా సత్కరించారు. మండల సర్వసభ్య సమావేశంలో ఆయా శాఖల వారీగా ప్రజాసమస్యలపై ఎంపీపీ అధ్యక్షతన ప్రభుత్వ ఆయా శాఖ అధికారులు ప్రజా అభివృద్ధిసమస్యలను సేకరించి నివేదికలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగిన వారికి పింఛన్, పక్కా గృహ నిర్మాణ మంజూరు, శ్మశానానికి రోడ్డు మార్గం నిర్మాణ పనులు, ప్రతి గ్రామ పంచాయతీలో సీసీ రోడ్లు ఏర్పాటు, నూతనంగా గృహ నిర్మాణం కోసం అధికారుల ధృవీకరణ పత్రాలతో గృహ నిర్మాణ పనులు, వ్యవసాయ సాగులు, రైతన్నలకు అందవలసిన ప్రభుత్వ ఆసరా విషయాలపై ప్రభుత్వ అధికారులు సకాలంలో స్పందించి ప్రభుత్వ పాలనకు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు ఆరణి విద్యనాథరెడ్డి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, ఎంపీడీవో త్రివిక్రమరావు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ విశ్వనాథ నాయుడు, కొత్తపాళెం సర్పంచ్ హరిప్రసాద్, బీఎన్ కండ్రిగ ఉప సర్పంచ్ కె.ఎం.రాజా,ఎంఈవోరవీంద్రనాథ్, ఆయాప్రభుత్వశాఖ అధికారులు,సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యాక్సిస్ నిఫ్టీ500 ముమెంటం 50 ఇండెక్స్ ఫండ్ ఆవిష్కరణ

తిరుపతి విద్య, జనవరి 22 ప్రభాత వార్త:

భారత్‌లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఫండ్ హౌస్‌లలో ఒకటైన యాక్సిస్ మ్యుచువల్ ఫండ్ సంస్థ, నిఫ్టీ500 ముమెంటం 50 టీఆర్ఐని ట్రాక్ చేసే యాక్సిస్ నిఫ్టీ500 ముమెంటం 50 ఇండెక్స్ ఫండ్ పేరిట ఓపెన్ ఎండెడ్ ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్వో) 2025 జనవరి 24న ప్రారంభమై ఫిబ్రవరి 7 వరకు అందుబాటులో ఉంటుంది. నిఫ్టీ500 ముమెంటం 50 టీఆర్ఐ ఈ ఫండ్‌కి ప్రామాణికంగా ఉంటుంది అని అన్నారు. యాక్సిస్ మ్యుచువల్ ఫండ్ సీఐవో ఆశీష్ గుప్తా మాట్లాడుతూ భారత్‌లో ఎప్పటికప్పుడు మారిపోయే మార్కెట్ పరిస్థితులను ఎదుర్కొని నిఫ్టీ 500 ముమెంటం 50 ఇండెక్స్ దీటుగా రాణిస్తోంది. వృద్ధికి అవకాశమున్న స్టాక్స్‌ను ఎంచుకోవడం ద్వారా కొన్ని సందర్భాల్లో విస్తృత మార్కెట్ సూచీలకు మించి మెరుగైన పనితీరు కనపరుస్తోంది అని తెలిపారు. ఈకార్యక్రమంలో సమస్త ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

కార్వేటినగరం ప్రభుత్వ ఐటిఐలో జాబ్‌మేళా

కార్వేటినగరం,జనవరి 22 ప్రభాతవార్త:

కార్వేటినగరం ప్రభుత్వ ఐటిఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ పి.గణేష్ తెలిపారు. కార్వేటినగరం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈనెల 25వ తేదీ జాబ్‌మేళాను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ,ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్,సీడప్,డిఆర్‌డిఎలు సంయుక్తంగా కలసి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ లోటస్ ఎంటర్‌ప్రైజస్,శ్రీరామ్‌చిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు జాబ్‌మేళాలో పాల్గొంటున్నారని అన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనే వారు ఇంటర్,డిగ్రీ పాసై 18సం॥నుండి 30సం॥లు మధ్య వయస్సు కలిగిన స్త్రీ మరియు పురుషుల అభ్యర్థులు హాజరు కావచ్చని చెప్పారు. ఈ జాబ్‌మేళాను నిరుద్యోగ యువతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ వివరాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెంబరు: 8142509017 (అబ్దుల్ అజీష్).

ఇనుప గ్రిల్స్ దొంగలను అరెస్ట్ చేయండి

తిరుపతిరూరల్, జనవరి 22 ప్రభాతవార్త:

అవిలాల చెఱువు ప్రహారీ గోడపై ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌ను దొంగలించే దొంగలను అరెస్ట్ చేయాలని స్థానికులు డిమాండ్ చేసారు. పట్టపగలే ఇనుప గ్రిల్‌ను తొలగించి, తస్కరించే క్రమంలో పశువుల కాపర్లకు దొంగ తొరికాడని, అతనిని పట్టుకుని తిరుపతిరూరల్ పోలీసులకు అప్పగించడం జరిగిందని పశువుల కాపర్లు తెలిపారు. రెండు అడుగుల ఎత్తు, పది అడుగుల పొడవు వున్న ఇనుప గ్రిల్స్ 13 ఎత్తు కెళ్ళినట్లు తెలిపారు. గ్రిల్స్ దొంగలను పట్టుకుని, కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

పాడిపేట మహిళకు రూ.7లక్షల సి.యం. సహాయ నిధి

–ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు

తిరుపతిరూరల్, జనవరి22 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ పాడిపేటకు చెందిన ద్రాక్షాయణికి చికిత్స నిమిత్తం ముందస్తుగా నగదు సాయం అందించాలని ఆమె తల్లి దండ్రులు ఎమ్మెల్యే పులివర్తి నానిని కోరగా, సి.యం. సహాయ నిధి నుండి రూ.7లక్షల రుపాయాలను చికిత్స ముందస్తుగానే పంఫిణి చేసినట్లు తెలిపారు. చికిత్స అనంతరం వైద్యానికి అయ్యే పూర్తి ఖర్చును సి.యం. సహాయ నిధి ద్వారా చెల్లించుటకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తమ బిడ్డ ఆరోగ్యానికి సహకరించిన ఎమ్మెల్యే నానికి ద్రాక్షాయణి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. తమ బిడ్డకు ప్రాణభిక్షపెట్టిన సి.యం. చంద్రబాబునాయుడుకి, ఎమ్మెల్యే నానికి ఎల్లవేళల ఋణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

సత్యవేడు, జనవరి 22 ప్రభాతవార్త:

సీపీఎం పార్టీ 27వ రాష్ట్ర మహాసభలు సందర్భంగా గోడపత్రికలను సత్యవేడు పార్టీ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి జనార్ధన్, సత్యవేడు మండల కార్యదర్శి మెలుగు రమేష్‌లు మాట్లాడుతూ నెల్లూరు పట్టణంలో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో రాష్ట్ర 27వ మహాసభలు జరుగుతాయని తెలిపారు. 3వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జరిగే బహిరంగ సభ, ర్యాలీలో వేలాదిగా ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరు పట్టణంలో జరిగే రాష్ట్ర మహాసభలకు సత్యవేడు నియోజకవర్గం నుంచి భారీగా ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ బహిరంగ సభలో పొలిట్‌బ్యూరో సభ్యురాలు, సభ్యులు బందాకారత్, బి.వి.రాఘవులు, ఎం.ఏ.బేబి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు మధు, తదితర పార్టీ అగ్రనేతలు పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో మునస్వామి, మురళి, తిరుమలరెడ్డి, అరుణ్ కృష్ణయ్య, రాజీవ్, రాణి తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి ఎన్టీఆర్ మెమోరియల్ ఏపీ తైక్వాండో పోటీలు

పోస్టర్ ఆవిష్కరించిన శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి క్రీడ, జనవరి 22, ప్రభాతవార్త:

ఈనెల 31వ తేదీ నుంచి ఫిబ్ర వరి 2వ తేదీ వరకూ కాకినా డలోని ఎన్టీయూకే ఇండోర్ స్టేడియంలో 1వ ఎన్టీఆర్ మె మోరియల్ ఏపీ స్టేట్ తైక్వాం డో ఛాంపియన్‌షిప్ - 2025 పోటీలు నిర్వహించ నున్నట్లు చిత్తూరు జిల్లా యూత్ తైక్వాం డో అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సభ్యులు తిరుపతిలోని డీఎస్డీఓ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేశారు. అనంతరం యూత్ తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యుల విజ్ఞప్తి మేరకు శాప్ ఛైర్మన్ రవినాయుడు చేతులు మీదుగా 1వ ఎన్టీఆర్ మెమోరియల్ తైక్వాండో ఛాంపియన్షిప్ పోస్టరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా డీఎస్డీఓ బాలాజీ, తిరుపతి జిల్లా డీఎస్డీఓ సయ్యద్, చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ మనోహర్, జాయింట్ సెక్రటరీ రమణ, ట్రెజరర్ శ్రీను, ఈసీ మెంబర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాట్ ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

తిరుపతి విద్య జనవరి 22 ప్రభాత వార్త:

స్థానిక న్యూ ఇందిరానగర్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి క్యాష్ అవార్డ్స్,మెడల్ సర్టిఫికెట్స్ బహుమతులుగా సాధించారు.ఈ సందర్భంగా ఏజీఎం సురేష్ మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యార్థులు అన్నింటిలోనూ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటారని తెలుపుతూ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.ఈ పరీక్షల్లో మొత్తం 138 మంది విద్యార్థులు బహుమతులు గెలపొందారని,ఇందులో యువన్ కార్తికేయ, అభిలాష్,దిలీప్ రెడ్డి, దేవాన్స్,సంహిత, ఆరాధ్య,సిదార్థ,వేదశ్రీ,నాగరిషిక్,మహమ్మద్,లోహిత్,హేమ సాయి,లాస్య,ప్రేమ కేశవ వీరందరూ క్యాష్ అవార్డ్స్ పొందారని తెలిపారు.63 మంది మెడల్స్,61 మంది మెరిట్ సర్టిఫికెట్స్ సాధించారని అన్నారు.ప్రిన్సిపాల్ శ్రీవాణి,జోనల్ కోఆర్డినేటర్ బాలాజీ,జోనల్ డీన్ కాశీ రావు,వైస్ ప్రిన్సిపాల్ కీర్తి, ఐకాన్ఇన్చార్జిత్రిలోక్,సీ బ్యాచ్ ఇన్చార్జి లోకేష్,ఎస్ బ్యాచ్ ఇంచార్జి ఆమని, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

కేవీబీ పురంలో ముమ్మర వాహనాలు తనిఖీ

పలువురికి జరిమానా

కేవీబీ పురం, జనవరి 22 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలకేంద్రంలో స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నరేష్ సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ నిర్వహించారు. వాహనాలకు ఆధారాలు లేని వారికి హెల్మెంట్ ధరించిన వారికి ఎస్ఐ జరిమానా విధించారు. రోడ్డు భద్రత చట్టాలను ఉల్లంఘించిన త్రిబుల్ రైడింగ్ చేసిన హెల్మెట్ లేకుండా వా

అందుబాటులో లేని ఉద్యానవనశాఖ అధికారి

వెంకటగిరి, జనవరి 22 ప్రభాతవార్త : ఉద్యానవన శాఖ కార్యాలయానికి ఎప్పుడు తాళం వేసి ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యానవన శాఖ అధికారి ఒక్కరే కార్యాల యంలో ఉండడంతో ఎప్పుడూ తాళం వేసి ఉందని రైతులు వాపోతున్నారు. అధికారి ఎప్పుడు క్యాంపుల్లో ఉంటున్నారని ఆందోళన చెందుతున్నారు. అధికారి స్థానికంగా కూడా నివాసం లేదని రైతులు విమర్శిస్తున్నారు. కార్యాలయం ఉన్నట్టు బోర్డు కూడా పెట్టలేదని పలువురు రైతులు మండిపడు తున్నారు. ఉన్నతాధికారులైన చర్య తీసుకుని ఉద్యానవన శాఖ అధికారిని అందుబాటులో ఉండే విధంగా చేయాలని రైతుల కోరుతున్నారు.

గూడూరు డివిజన్

సర్వే పారదర్శకంగా ఉండాలి : డిఎల్‌డిఓ

కోట, జనవరి 22 ప్రభాతవార్త : ప్రభుత్వం అమలు చేసే పథకాలకు సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న సర్వే పారదర్శ కంగా ఉండాలని డిఎల్‌డిఓ వాణిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో సచివాలయ ఉద్యోగులకు, కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ వేణు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళా ఆర్థిక అభివృద్ధి అదానీ ఫౌండేషన్ కృషి

గూడూరు, జనవరి 22 ప్రభాతవార్త : మహిళా ఆర్థిక అభివృద్ధికి ఆదాని కృష్ణపట్నం పోర్టు సామాజిక బాధ్యతలో భాగంగా ఆదానీ ఫౌండేషన్ కృషి చేస్తుంది. అందులో భాగంగా రెండు రోజులు పాటు వెంకటగిరి కృషి విజ్ఞాన్ కేంద్రం సహకారంతో చిలకూరు మండలం తమ్మినపట్నం గుమ్మలదెబ్బకు చెందిన మహిళలకు వేరుశనగ చిక్కీలు తయారీతో పాటు మార్కెటింగ్ విధానంలో మెలకువలను వెంకటగిరి కేవీకేలో శిక్షణ పొందారు. కెవికే సిబ్బంది చిక్కిలి శిక్షతో పాటు మార్కెటింగ్లో మెలకువలను ప్రాక్టికల్స్‌గా వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో కె.వి.కే సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసరెడ్డి కె.వి.కె బృందం అదాని ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విజయ దీపిక పుస్తకాలు పంపిణీ

తడ, జనవరి 22 ప్రభాతవార్త : తడ మండలంలోని అన్ని జిల్లా పరిషత్ హైస్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు బుధవారం విజయ దీపిక పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమా ల్లో ఎంఇఒ, హెడ్మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నా రు. 10వ తరగతి చదివే విద్యార్థులు విజయ దీపిక పుస్తకాలను సద్వినియోగం చేసుకొని మంచి ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రఘు, ఎంపిడిఓ విజయకుమార్, ఎంఇఒ మల్లికార్జునరావు

అక్షర వెలుగు పుస్తకాలు పంపిణీ:

అలాగే మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షర వెలుగు అనే పుస్తకాలు పంపిణీ చేశారు. వయోజన విద్య ద్వారా చదువుకునే వారికి ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఎంపిక చేసిన చదువుకున్న వారి ద్వారా చదువు చెప్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం, సిసి, విఒఎలు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఎంహెచ్‌ఓ తనిఖీలు

కోట, జనవరి 22 ప్రభాతవార్త : కోట మండలం చిట్టేడు ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డిఎంహెచ్‌ఓ పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ ప్రాంతంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి డాక్టర్ నాగరాజు వివరించారు. ప్రస్తుతం విష జ్వరాలు వస్తున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సూచించారు.

పారిశుధ్యం పడకేసినా పట్టించుకోరా!

గూడూరు, జనవరి 22 ప్రభాతవార్త : గూడూరులోని అరుంధతీవాడ ప్రజల గోడు పట్టించుకునే నాథుడే లేడా అని, దళిత కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత 3 నెలలుగా చెత్త డంపింగ్ యార్డ్‌ల మారిపోయిన అరుంధతీవాడ అంటే మున్సిపల్ అధికారులకు అంత అలుసా అని స్థానికులు ప్రశ్నస్తున్నారు. కాలువలలోని డ్రైనేజీ నీరు రోడ్లపైకి నదిలా తలపిస్తున్న వైనం అయినా స్పందించని సిబ్బంది. పలుమార్లు మున్సిపల్ అధికారు లకు తెలియ జేసినా ఇదిగో అదిగో అంటూ మాటదాట వేస్తున్న మున్సిపల్ శాఖ సిబ్బంది. మున్సిపల్‌శాఖలో వార్డు శుభ్రపరిచే కార్మికుడి నుండి పై ఉన్నతాధికారుల వరకు దళితవాడ అంటే అంతచిన్నచూపా అని ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా మున్సిపల్‌శాఖ సిబ్బంది డ్రైనేజీపై తగు మరమ్మతులు చేసి ప్రజలను ప్రాణాపాయ స్థితి నుండి కాపాడాలని డిమాండు చేస్తున్నారు.

జెఇఇ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

కోట, జనవరి 22 ప్రభాతవార్త : దేశ వ్యాప్తంగా జెఇఇ మెయిన్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు వారి వారి తల్లిదండ్రులతో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఈ పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. కాగా, 84 మంది విద్యార్థులకు గాను 81 మంది హాజరైనట్లు కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్.కిషందర్ తెలిపారు.

పవన్ కళ్యాణ్ కలిసిన కృష్ణయ్య

వెంకటగిరి, జనవరి 22 ప్రభాతవార్త : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం, డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీసు నందు మర్యాదపూర్వకంగా కాపు బలిజ సంక్షేమ సంఘం నాయకుడు తోట కృష్ణయ్య కలిశారు. నియోజకవర్గ పార్టీ పరిస్థితిపై పవన్ కళ్యాణ్‌కు ఆయన వివరించారు. కలిసి పలు విషయాలు చర్చించారు. తరువాత పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్‌ని, ఆంధ్రప్రదేశ్ స్టేట్ టిట్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌ని ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడుని కలవడం జరిగిందన్నారు.

బోర్లు మంజూరు చేసి దాహార్తి తీర్చండి

కోట, జనవరి 22 ప్రభాతవార్త : మేజర్ పంచాయతీ కోటలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, యుద్ధప్రాతిపదికన రెండు హ్యాండ్ బోర్లు మంజూరు చేయాలని ఎంపిటిసి సభ్యులు షేక్ షంషుద్దిన్, దారా సురేష్‌లు ఎంపిడిఓ వేణుని కోరారు. బుధవారం ఎంపిడిఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరుంధతీయవాడలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదే క్రమంలో ఎన్‌జిఆర్ నగర్‌లో కూడా ప్రజలు తాగునీటి కోసం అలమటిస్తున్నారని అన్నారు. ఈ విషయంపై ఎంపిడిఓ వేణు స్పందిస్తూ తక్షణమే రెండు హ్యాండ్ బోర్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

తడకండ్రిగలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం

తడ, జనవరి 22 ప్రభాతవార్త : తడ మండలం తడకండ్రిగ గ్రామంలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎపిపిజి బ్యాంకు వారు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. బ్యాంకు ఆర్ఎం మోహన్‌రెడ్డి, మేనేజర్ సాయిభరత్, ఫీల్డ్ ఆఫీసర్ విజయ్‌తేజ, ఎంఇఒ మల్లికార్జునరావు, పాఠశాల హెచ్ఎం సురేంద్ర, కాంప్లెక్స్ హెచ్ఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఏడిఏఎం

వెంకటగిరి, జనవరి 22 ప్రభాతవార్త : సకాలంలో రైతులు పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడిఏ ఎం.నాగార్జునసాగర్ తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లి చిన్నపరెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల రక్షణను సకాలంలో చేపట్టాలని సూచించారు. పంటలలో సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు.ఈనెల 23,24 తేదీల్లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. పంటల రక్షణకు రైతులు సామూహిక ఎలుకల నివారణ మందును పెట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుజాత సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులతో మహిళల ఉపాధి

వెంకటగిరి, జనవరి 22 ప్రభాతవార్త : చిరుధాన్యాలు, మునగాకు పొడి తో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారుచేసి మహిళలు ఉపాధి పొందచ్చని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ శ్రీనివాసరెడ్డి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త విజయ శ్రీ తెలిపారు. అలానే ఫౌండేషన్ కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రంలో పొదువు మహిళలకు చిరుధాన్యాలు మునగాకు పొడితో బిస్కెట్లు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవుని ఆరోగ్యం కోసం విలువ ఆధారిత ఉత్పత్తిలో తయారుచేసి ఆదాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని ఫౌండేషన్ ప్రతినిధి సెల్వ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్.బి. కె.ఆర్ నాన్ టీచింగ్ ఉద్యోగుల... సమస్యలను పరిష్కరించండి

గూడూరు, జనవరి 22 ప్రభాతవార్త : ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల నాన్ టీచింగ్ స్టాఫ్ తమ సమస్యలను తెలియజేస్తూ గూడూరు సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో డిఎస్పీ గీతకుమారికి ఎన్‌బికెఆర్ నాన్ టీచింగ్ స్టాఫ్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ఏఐటియుసి, సీపీఐ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగులు తమ సమస్యలను తెలియజేశారు. దీనిపై పూర్తిగా విచారణ చేస్తామని డిఎస్పీ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి శశి కుమార్, ఏఐటియుసి నియోజక వర్గ అధ్యక్షులు ఎంబేటి చంద్రయ్య, వెంకటయ్య, ఎన్‌బికెఆర్ నాన్ టీచింగ్ స్టాఫ్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు బాబు రావు, ట్రెజరర్ గౌస్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా అల్లంపాడు

కోట, జనవరి 22 ప్రభాతవార్త : రీ సర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా కోట మండలం అల్లంపాడు గ్రామానికి ఎంపిక చేశారని తహశీల్దార్ కె.జయ జయరావు చెప్పారు. ఆ మేరకు బుధవారం అల్లంపాడు గ్రామంలో రీసర్వే కార్యక్రమాన్ని తహ శీల్దార్ భూమి పూజ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లంపాడులో రోజుకు నాలుగు టీములు వీఆర్ఓలు, సర్వేయర్లు కలిపి ఒక్కొక్కరోజుకు 20 ఎకరాలు చొప్పున రీసర్వే చేస్తారని తెలిపారు. నాలుగు టీములు కలిపి రోజుకు 80 ఎకరాలు సర్వే చేస్తారని చెప్పారు. రైతులు కూడా పూర్తిస్థాయిలో సర్వేయర్లు, వీఆర్ఓలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపిరెడ్డి, విఆర్ఓలు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో దిస్కూల్ విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి జనవరి 22 ప్రభాతవార్త : పట్టణంలోని ది స్కూల్ విద్యార్థులు సైన్సు,గణితశాస్త్రం ఒలంపియాడ్‌లో ఉత్తమ ప్రతిభ చాటారని కరస్పాండెంట్ జనార్దన్‌రావు జె.పవార్ గురువారం తెలిపారు.ఈ సందర్భంగా జె.పవార్ మాట్లాడుతూ ఢిల్లీ వారిచే గత నెలలో నిర్వహించిన జాతీయ స్థాయి ఒలంపి యాడ్ పోటీ పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులకు సైన్సుఒలంపియాడ్‌లో 153 మంది గాను 34 మంది ద్వితీయ స్థానానికి అర్హత సాధించారన్నారు. అలాగే గణిత ఒలంపియాడ్ పరీక్షల్లో 112 మంది గాను 30 మంది ద్వితీయ స్థాయి అర్హత సాధించారన్నారు. ఈ మేరకు ఫిబ్రవరి నెలలో తిరుపతిలో జరిగే రెండవ స్థాయి అర్హత పరీక్షకు తమ పాఠశాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేస్తాం

- అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తా
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్, జనవరి 22, ప్రభాతవార్తనగర అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివా సులు పిలుపునిచ్చారు. బుధవారం స్మార్ట్ సిటీ, తుడాలో అభివృద్ధి పనులపై మున్సి పల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. స్మార్ట్ సిటీ పనుల పూర్తికి రాష్ట్ర వాటా కింద రావాల్సిన నిధులను వీలైనంత త్వరగా ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. 19 స్మార్ట్ సిటీ పనులు పెండింగ్‌లో ఉండగా వీటి పూర్తి చేయడానికి నిధులు అవసరమని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తక్షణం 25 కోట్లు మంజూరు చేస్తే స్మార్ట్ సిటీ పెండింగ్ పనులు పూర్తవుతాయని అధికారులు ఆయనకు తెలిపారు. ఎన్డీఏ కూటమి ఏర్పాటైన వెంటనే 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర వాటాను చెల్లించడంతో మున్సిపల్ శాఖకు కేంద్రం నిధులు విడుదల చేసిందని ఆయన చెప్పారు. స్మార్ట్ సిటీ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రావాల్సిన నిధులపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్ళినట్లు ఆయన తెలిపారు. శెట్టిపల్లి భూ సమస్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల చొరవతో అతి త్వరలో పూర్తిగా పరిష్కారమౌతుందని ఆయన తెలిపారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ తో పార్కులు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. రాయలచెరువు రోడ్డు రైతు బజార్‌ను ఆనుకుని నిర్మిస్తున్న తుడా టవర్స్‌ను త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, తుడ సెక్రటరీ వెంకట నారాయణ, సూపరింటెం డెంట్ ఇంజినీర్లు కృష్ణారెడ్డి, శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ జి.ఎం.చంద్రమోళి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, తిరుపతి నగరపాలక సంస్థ, తుడా ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌బికెఆర్ అధ్యాపకునికి డాక్టరేట్

కోట, జనవరి 22 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకుడు పొద్దుటూరు సునీల్ కుమార్ డాక్టరేట్ లభించిందని డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి చెప్పారు. ఆ మేరకు బుధవారం డాక్టరేట్ అందుకున్న సునీల్‌కుమార్‌ను కళాశాల డైరెక్టర్ , విభాగాధి పతులు రాజశేఖర్‌రెడ్డి, నారాయణ రావు, సహ ఉపాధ్యాయులు అభినందించారు. విజయకుమార్‌రెడ్డి మాట్లాడు తూ స్ట్రెంతనింగ్ ది రిలయబిలిటి అండ్ కంజెషన్ కంట్రోల్ ఆఫ్ ఫ్లయింగ్ అడ్హక్ నెట్‌వర్క్స్ బై ఇంప్లిమెంటింగ్ మల్టీ పాత్ రౌటింగ్ ప్రొటోకాల్ టు డిజైన్ ఎన్ ఇన్క్యుక్యులెట్ అండ్ డెక్స్ట్రస్ టోపోలాజి ఫర్ సక్యూర్డ్ డేటా ట్రాన్స్‌మిషన్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు అనంతపురం లోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు సునీల్‌కు డాక్టరేట్ అందజేసినట్లు చెప్పారు. యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ రఘునాథరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు తెలిపారు. ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల్లో పనిచేస్తూ డాక్టరేట్ పొందడానికి సహాయ సహకారాలు అందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

నగర శుభ్రతకు సహకరించండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జనవరి 22 ప్రభాతవార్త: ప్రజలు చెత్త బుట్టలను వినియోగించి నగర శుభ్రతకు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. బుధవారం నగరంలోని రాయల్ నగర్, మారుతి నగర్, రైతు బజారు, ఎమ్మార్ పల్లి కూడలి, వెస్ట్ చర్చి తదితర ప్రాంతాల్లో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాల వద్ద చెత్త రోడ్లపైనే వేస్తుండడం చూసి మందలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాము తనిఖీ చేసిన పలు ప్రాంతాల్లోని దుకాణదారులు చెత్త బుట్టలు వినియోగించకుండా, చెత్తను కవర్లలో వేసి కాలువల్లో పడేస్తున్నారని అన్నారు. ఇలా చేయడం వలన కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు నీరు రోడ్లపైకి వచ్చి అపరిశుభ్రంగా తయారవుతుందని అన్నారు. ప్రజలు, దుకాణదారులు చెత్త బుట్టలు వినియోగించి మీ వద్దకు వచ్చే మా సిబ్బందికి చెత్త అందించి నగరం శుభ్రంగా ఉండేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. నగరంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా పరిశుభ్రతకు సహకరించాలని అన్నారు. కాలువల్లో చెత్త తొలగించి అక్కడే వేస్తున్నారని పిర్యాదులు వస్తున్నాయని, ఆ చెత్తను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, తుడ ఈఈ రవీంద్ర, డి.ఈ.లు, ఏసిపి బాలాజి, సర్వేయర్ కోటేశ్వర రావు, శ్రీనాథ్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

దారిలేని పూతలపట్టు ప్రభుత్వ కళాశాల

పూతలపట్టు, జనవరి 22 ప్రభాతవార్త

మండలకేంద్రంలో దారిలేని ప్రభుత్వ కళాశాలలో సుమారు 120 మంది పైగా విద్యార్థిని విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల 1999సంవత్సరంలో స్థాపించారు.సుమారు 25 సంవత్సరాల పూర్తి కావస్తున్న దారి కూడా నోచు కోలేని స్థితి ఏర్పడింది అనే విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు వాళ్లకు మాత్రమే తెలుసు పూతలపట్టు చుట్టుపక్కల మండలకు గ్రామాలకు కొంతమందికి కళాశాల ఉంది. అని తెలియదు గతంలో జిల్లా విద్యాశాఖ అధికారులు ఎమ్మెల్యేలకు ఎంపీలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యల పట్ల అనేక వినతి పత్రాలు సమర్పించిన ప్రయోజనం లేకపోయిందని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత దారి సౌకర్యం కల్పించకపోవడం చేత విద్యార్థిని విద్యార్థులు ఇండ్ల మధ్యలో కళాశాలకు వెళుతున్నారు. దీనితో ఇళ్లలో నివాసం ఉన్నవారు ఇండ్ల మధ్యలో రావద్దండి అని అభ్యంతరం చేస్తున్నారు. ప్రజెంట్ ఉన్న ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి చొరవ తీసుకుంటే మరింత అభివృద్ధి అయ్యే అవకాశం ఉంది ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ప్రైవేట్ కళాశాల దీటుగా ప్రతి ఏడాది విద్యార్థిని విద్యార్థులు జాయినింగ్ చేసుకోవడం కోసం వెళ్లాల్సి ఉంది. ప్రిన్సిపాల్ లెక్చరర్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేయకపోవడ మే అభివృద్ధికి నోచుకోకపోవడమే నిదర్శనం పూతలపట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఉన్నత అధికారులు కూటమి ప్రభుత్వం చొరవతో దారి కల్పించి అభివృద్ధికి కృషి చేయాలని చుట్టుపక్కల ఉన్న మండలాలు గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీకి మహర్ధశ : ఎంఎల్‌ఏ

రూ.12.82 కోట్లతో సిసి రోడ్లకు శంకుస్థాపన



చంద్రగిరి, జనవరి 22 ప్రభాతవార్త: తొండవాడ పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీకి మహర్ధశ పడుతుందని ఎంఎల్‌ఏ పులివర్తి నాని అన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి బుధవారం ఎంఎల్‌ఏ పులివర్తి నాని, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన గావించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో రోడ్లు, కాలువలు, మంచినీటి సౌకర్యం, శ్మశాన వాటిక వంటి మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రం, ప్రైమరీ స్కూల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. కాలనీ ప్రజలకు సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుతం కాలనీలో 35 పనులను రూ.12.82 కోట్లతో చేపట్టినట్లు వివరించారు. కూటమి పాలనలో అభివృద్ధి ఎలా వుంటుందో చేసిచూపెడతామన్నారు. గత ప్రభుత్వం కేవలం మాయమాటలతో కాలం వెళ్ళబుచ్చిందని ఎద్దేవా చేశారు. అంతకుముందు కాలనీ మధ్యలోని రావిచెట్టు రచ్చ వద్ద వారు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎంఎల్‌ఏ స్వయంగా కలెక్టర్ ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్ళి కాలనీ మొత్తం కలియదిరిగారు. ఈ క్రమంలో అభివృద్ధికి సంబంధించి ఇరువురూ పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నారు. అంతకుముందు ఎంఎల్‌ఏ రోడ్డు రోలర్‌ను నడిపి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ రామ్మోహన్, తహశీల్దార్ శివసుబ్బరామయ్య, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, ఉపాధ్యక్షుడు శానంబట్ల తులసిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, నాయకులు మొక్కల కుమార్ రాజారెడ్డి, పులికంటి మోహన్ రెడ్డి, ఏజి పల్లి బాల, హౌసింగ్ డిఈ శ్రీరాములు రెడ్డి, విద్యుత్ ఏడిఈ శేషాద్రిరెడ్డి, ఏఈలు రాములు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు నిర్మించుకోవడానికి దరఖాస్తులు చేసుకోండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జనవరి 22 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో సొంత స్థలం కలిగి ఉండి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ప్రభుత్వ సబ్సిడీ ద్వారా సొంతంగా ఇల్లు నిర్మించుకోవడానికి తిరుపతి నగరంలో అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం తెలిపారు. తిరుపతి నగరంలో సొంత స్థలం కలిగి ఉండి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా 2లక్షల 50వేల ప్రభుత్వ సబ్సిడీ ద్వారా సొంతంగా ఇల్లు నిర్మించుకోవడానికి ఆసక్తి ఉన్న లబ్ధిదారులు మీ దగ్గరలో ఉన్న సంబంధిత వార్డు సచివాలయంలో అమెనిటి సెక్రెటరిని కలసి, లబ్ధిదారుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, పాన్ కార్డు, కులం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, ల్యాండ్ డాక్యుమెంట్స్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ తదితర పత్రాలను సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని కమిషన